బరి తెగిస్తున్నారు!

- గ్రామాల్లో కోడిపందేలకు సిద్ధం
- కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- జనసేన, టీడీపీలు వేర్వేరుగా పందేలు
- విజయం దక్కించుకొనేందుకు పైరవీలు
- ప్రతి గ్రామంలో రెండు బరులు
- పోలీసుల హెచ్చరికలు బేఖాతరు

నిడదవోలు రూరల్: సంప్రదాయాల ముసుగులో కోడి పందేలు నిర్వహించొద్దు.. సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోండి.. జూదాల జోలికి వెళ్లకండి.. అంటూ పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. కోడిపందేలు, గుండాట, పేకాట తదితర జూదాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని హెచ్చరిస్తున్నారు. అయినా ఇవేమీ నిర్వాహకులకు పట్టడం లేదు. కోడి పందేల నిర్వహణకు గ్రామాల్లో పందెంరాయుళ్లు చకాచకా ఏర్పాట్లు చేస్తున్నారు. సాంప్రదాయంగా వస్తున్న కోడిపందేలను నిర్వహించి తీరుతామని చెబుతున్నారు. ఏటా సంక్రాంతి ముందు ఇలాంటి హెచ్చరికలు ఎప్పుడూ ఉండేవేనని, పందాలు యథావిధిగా జరుగుతాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు మండలంలో గత వారం రోజులు పందెం కోడిపుంజుల విక్రయాలు జోరందుకున్నాయి. ఒక్కో కోడిపుంజు ధర రూ.3 వేల నుంచి రూ.10 వేల పైనే పలుకుతోంది. గ్రామాలకు దూరంగా ఆయా ప్రాంతాలను ఎంపిక చేసుకుని పందేల నిర్వహణకు ఇప్పటికే బరులు సిద్ధం చేశారు. నిడదవోలు పరిధిలో ఏటా కోడిపందేల నిర్వహణతో రూ.కోట్లు చేతులు మారుతున్నాయి. మండలంలోని సింగవరంలో జరిగే పోటీలకైతే రాజకీయ, సినీ నటులు, వ్యాపార వేత్తలు వచ్చి భారీ స్థాయిలో పందేలు కాస్తుంటారు. నిడదవోలుతో పాటు విజ్జేశ్వరం, డి.ముప్పవరం, కాటకోటేశ్వరం, తాడిమళ్ల, కోరుమామిడి తదితర గ్రామాల్లో కోడిపందేల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. **సమిశ్రగూడెం పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పందేలు ఎక్కడ నిర్వహిస్తున్నారో గుర్తించి సంబంధిత యాజమానులకు హెచ్చరికలు జారీ చేసినట్టు ఎస్సై కె.వీరబాబు తెలిపారు.** ఎవరైనా పందేలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని,ప్రతి గ్రామంలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, పోలీస్ సిబ్బందితో నిఘా ఉంచామని ఆయన పేర్కొన్నారు.

కోడి పందేలకు సై..

దేవరపల్లి: గ్రామాల్లో కోడిపందేల నిర్వహణకు బరులు సిద్ధమయ్యాయి. పోలీసుల హెచ్చరికలను పందెం నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు. ఎన్ని హెచ్చరికలు చేసినా తగ్గేదే లే.. అంటున్నారు పందెం రాయుళ్లు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల్లో ఆదివారం గ్రామాలకు దూరంగా కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో బరులు సిద్ధం చేస్తున్నారు. బరుల చుట్టూ పెన్సింగ్‌లు ఏర్పాటు చేసి, గ్యాలరీలు నిర్మాణం చేస్తున్నారు. దేవరపల్లి మండలంలో 10 గ్రామాల్లో బరులు సిద్ధం చేసినట్టు సమాచారం అందింది. దేవరపల్లి, చిన్నాయగూడెం, దుద్దుకూరు, బందపురం, గౌరీపట్నం, త్యాజంపూడి, యర్నగూడెం, కురుకూరు, ధుమంతునిగూడెం గ్రామాల్లో భారీ ఎత్తున పందాలు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పందేల మాటున అసాంఘిక కార్యక్రమాలకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

ప్రతి గ్రామంలో రెండు..

కూటమి నేతల మధ్య విభేదాలు రావడంతో జనసేన, టీడీపీ నాయకులు వేర్వేరుగా బరులు సిద్ధం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో రెండు బరులు ఏర్పాటు జరుగుతున్నట్టు సమాచారం అందింది. బరుల ఏర్పాటుకు రెండు పార్టీల నేతలు పైరవీలు చేస్తున్నారు. గ్రామంలో ఒకే బరి ఉండాలని టీడీపీ నేతలు అంటుండగా, లేదు లేదు మా బరి మాదే అంటున్నారు జనసేన నేతలు. ఇది ఎలా జరుగుతుందో చూడాల్సి ఉంది.


దేవరపల్లి-యాదవోలు రోడ్డులో కోడి పందేలకు సిద్ధం చేసిన బరి

కోడి గెలుస్తుందా.. ఖాకీ గెలుస్తుందా.

పెరవలి: కోడిపందాలు, జూదం నిర్వహించకూడదని పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్నా, క్షేత్ర స్థాయిలో అది అమలు కావడంలేదు. పందెంరాయుళ్లు, నిర్వాహకులు బరులను సిద్ధం చేస్తున్నారు. ఒకవైపు హైకోర్టు ఉత్తర్వులు జారీ, మరోవైపు జిల్లా ఎస్పీ కోడి పందేలపై ఉక్కుపాదంమోపడంతో బరులు జరుగుతాయా లేదా అనే సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు. పెరవలి మండలంలో ఖండవల్లి, ముక్కామల, పెరవలి, అజ్జరం, వెంకట్రాయపురం, మల్లేశ్వరం, పిట్టల వేమవరం గ్రామాల్లో పందేలు బరులు సిద్ధం చేశారు. ఇవే కాకుండా జూదం, గుండాటలు ఆడటానికి అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులు ఆదివారం కొద్దిసేపు హడావుడి చేశారు. బరుల వద్ద టెంట్లు పీకేసి, అక్కడే విధులు నిర్వహించారు. అయితే ఇదంతా మామూలే కానీ సోమవారం ఉదయం నుంచి కానీ మధ్యాహ్నం నుంచి కానీ పందేలు యథావిధిగా జరుగుతాయని చెబుతున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకూ 160 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

పందేలకు సిద్ధం

చాగల్లు: మండంలో కోడి పందేలకు ఏర్పాట్లు జోరు జరుగుతున్నాయి. మండలంలో మీనానగరం,


ఖండవల్లిలో కోడిపందేల బరి సిద్ధం చేస్తున్న యజమానులు

బ్రాహ్మణగూడెం, మల్లవరం, చిక్కాల, ఊనగట్ల గ్రామాల్లో ప్రతి ఏడాది పందేలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా జరుగుతాయని ప్రజలు అంటున్నారు. అయితే ఇప్పటికే ప్రత్యేక పోలీస్‌పికెట్లు ఏర్పాటు చేసినట్టు చాగల్లు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. చిక్కాల, మీనానగరం, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, మల్లవరం గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

పందేలకు బరుల సిద్ధం

తాళ్లపూడి: తాళ్లపూడి మండలంలోని గజ్జరం, పెద్దేవం, తాళ్లపూడి, వేగేశ్వరపురం, రావూరుపాడు, మలకపల్లి తదితర గ్రామాల్లో బరులు సిద్ధం చేస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. ఇప్పటికే 44 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

నేటి నుంచి ముత్యాలమ్మ అమ్మవారి జాతర



ఉండ్రాజవరం : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, కె.సావరం గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర ఐదేళ్ల కోసారి జరుగుతుంది. ఈ ఏడాది ఈ నెల 13వతేదీ నుంచి అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభకాన్నాయి. ఇందుకు ఏర్పాట్లతో గ్రామం కోలాహలంగా మారింది. ఈనెల 15వ తేదీన నైవేద్యాల సమర్పణతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రస్తుతం కమిటీ సభ్యులు జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాతల సహకారంతో కె.సావరం, టి.వేమవరం, జంగంచెరువు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి జాతరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామంలో ప్రతి సెంటర్, వీధులు విద్యుద్దీపాలతో మెరిసిపోతున్నాయి. 13న అమ్మవారి సారె ఊరేగింపు, సాయంత్రం అమ్మవారి సేవా, ఊరేగింపు, 14న విశేష అర్చనలు, పూజలు, భక్తులకు దర్శనాలు, 15న ఉదయం అమ్మవారికి ఊయలసేవ, సాయంత్రం జ్యోతుల ఊరేగింపు కార్యక్రమం, రాత్రి అమ్మవారికి కుంభం పోసి నైవేద్యం చెల్లిస్తారు. 17న సాయంత్రం 4 గంటలకు ముగ్గుల పోటీలు, 18న హరే శ్రీనివాస కోలాట నృత్యం, 19న అమ్మవారి గుడి వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహిస్తారు.

క్లుప్తంగా

వైభవంగా కుంతీదేవి ఉత్సవాలు


కుంతీదేవిని ఊరేగింపుగా తీసుకువెళుతున్న గ్రామస్తులు

దేవరపల్లి: పల్లంట్లలో కుంతీదేవి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం కుంతీదేవిని గ్రామంలో వైభవంగా ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు. ఏటా సంక్రాంతికి ముందు కుంతీదేవి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, ఉత్సవ కిమిటీ ప్రతినిధులు అక్కబత్తుల వెంకటరమణ, చింతల దాసు, పూతలపాటి ఏసు, మెట్టపల్లి వెంకటేశు, మందపాటి దశరధుడు, చింతల హరియ్య, పాముల భూదేవి, భక్తులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం


బాధితులికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మానవత చైర్మన్ రాంబాబు

గోపాలపురం: పెద్దగూడెం గ్రామానికి చెందిన అక్కాబత్తుల దేవి గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. మండల మానవత స్వచ్ఛంద సంస్థ రూ.4వేల ఆర్థిక సహాయాన్ని ఆమెకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మానవత మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న అక్కాబత్తుల దేవికి మరికొంత మంది ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో మానవత సభ్యులు గెడ జోగేంద్రప్రసాద్, కె.నాగరాజు, టీవీ సత్యనారాయణ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


అచ్చియపాలెంలో పేదలకు దుప్పట్లు అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

దేవరపల్లి: దేవరపల్లి కేంద్రంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్న టి ముకుంద స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా మండలంలోని అచ్చియపాలెం, బుచ్చియపాలెం గ్రామాల్లోని 120 మంది పేదలకు ఆదివారం సంస్థ వ్యవస్థాపకులు తంగెళ్ల సుబ్రహమణ్యం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రహమణ్యం మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే ప్రతి నెల 13వ తేదీని నిరుపేదల కుటుంబానికి బస్తా బియ్యం, ఆర్థికసాయం అందజేస్తున్నట్టు ఆయన వివరించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తమ సంస్థ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యుడు కోనాల పండు, పీతల కుటుంభరావు, టి ముకుంద సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పల్లెబాట పట్టిన కార్లు


పెరవలి వద్ద జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న కార్లు

పెరవలి: సంక్రాంతి పండగకు సొంత ఊరులకు వెళ్లేందుకు పట్టణవాసులు తమ కార్లలో పల్లెబాట పట్టారు. జాతీయ రహదారిపై కార్లు వేగానికి స్థానికులు, వాహన చోదకులు హడలిపోతున్నారు. జాతీయ రహదారిపై క్యూ తప్పకుండా వస్తున్న వాహనాలకు రోడ్డు దాటే పరిస్థితి లేకుండా పోయిందని ప్రయాణికులు చెప్పుకొంటున్నారు. రోడ్డు దాటాలంటే కనీసం 5 నిమిషాల సమయం పడుతుందంటే ఎన్నికార్లు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా గోదావరి జిల్లాలకు అందులో డెల్టా ప్రాంతానికి ఈ కార్లు అధికంగా వస్తున్నాయి. ఇవి అన్ని హైదరాబాద్, బెంగళూరు, మద్రాసు వంటి ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో రావడంతో జాతీయ రహదారి కిక్కిరిసిపోతోంది.

ఆర్థిక సాయం

దేవరపల్లి: గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చదలవాడ వీర్రాజు కుటుంబ సభ్యులను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, పార్టీ శ్రేణులు ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పసుపులేటి ప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు, చప్పటి శివనాగ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


కొవ్వూరులో ఉమా చోడేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: పట్టణంలో పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఉదయం గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన, అమ్మవార్లకు కుంకుమమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొతవరపు భాను, దేవరకొండ సాయి ప్రతాప్, దేవరకొండ ఉమామహేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు పర్యవేక్షించారు. వేమూరి సుందరేశ్వర శర్మ, వేమూరి ఫణీంద్ర శర్మ, తెన్నేటి సూర్యనారాయణ, పమ్మి రవిబాబు, గంగాధర భట్ల శ్రీరామచంద్రమూర్తి, వైవీఎస్ కామేశ్వరరావు, వాడ్రేవు సాయి కామరాజు, ఏడిద వీర వెంకట సత్యనారాయణ మూర్తి, చింత సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


తూర్పు చోడవరం జెడ్పీ హైస్కూలులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: తూర్పుచోడవరం జెడ్పీ హైస్కూలులో 1990-91 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. 35 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి ఆ నాటి గుర్తులను నెమరువేసుకుంటూ ఆనందంతో మురిసిపోయారు. తమకు చదువు చెప్పిన గురువులు రాధాకృష్ణశర్మ, వరహాలమ్మలను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి భోగవల్లి గణేష్, గుడిమెట్ల శ్రీనివాస్, గన్నమని రామారావు, ఉండవల్లి సతీష్, పిన్నమనేని సుభాషిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పూర్వ విద్యార్థుల కలయిక

గోపాలపురం: గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో కలుసుకుని అప్పటి పాఠశాల జరిగిన తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో వీరికి విద్యనందించిన ఉపాధ్యాయులు వీవీ వరప్రసాద్, సుశీల, శేషారత్నం, కిషోర్‌కుమార్, ఆలీ మాస్టార్లను సత్కరించి మెమోంటోలు అందజేశారు.


గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 1996-97 పది బ్యాచ్

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

నిడదవోలు: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పండగ మూడు రోజులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కోర్టు ఉత్తర్వులు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు యువత జూద క్రీడలు వైపు మొగ్గు చూపకుండా ఉండేందుకు గ్రామాల్లో, విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. పందెం బరులు సిద్ధం చేయకుండా ఉండేందుకు నిరంతరం గస్తీ తిరుగుతున్నామన్నారు. ఎవరైనా బరులు సిద్ధం చేయడానికి ప్రయత్నిస్తే ధ్వంసం చేసి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సంక్రాంతి సంప్రదాయంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు

చాగల్లు: దారవరంలో సంక్రాంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో, వివిధ ప్రదర్శనలతో సంప్రదాయబద్ధంగా సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. మహిళలు వేసిన రంగవల్లులు అందర్ని ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొడ్డు రాజు, బొడ్డు కేశవ, బొల్లిన నాగేంద్ర పాల్గొన్నారు.

సంక్రాంతి అంటేనే రంగవల్లులు


ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఆదినారాయణ

నిడదవోలు: పండగలు సంప్రదాయ ప్రతీకలని, సంక్రాంతి అంటేనే రంగవల్లులు గుర్తుకు వస్తాయని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో ఎస్‌ఎన్ స్వాతి ఆసుపత్రి యాజమాన్యం సంయుక్తంగా ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు వివిధ గ్రామాల నుంచి వచ్చి ముగ్గులు వేయడానికి పోటీపడ్డారు. న్యాయ నిర్ణేతలుగా ప్రియాశిని సర్కార్, కల్యాణి వ్యవహరించారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలిపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నీలం నాగేంద్రప్రసాద్, డాక్టర్ పరిమి వినోద్, కూటమి నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, డాక్టర్ కట్యాణ చక్రవర్తి, ఆనందం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలుదువ్వుతున్న పందెం కోళ్లు

కొవ్వూరు: కోడి పందేలకు పందెం రాయుళ్లు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఏటా మాదిరిగా పోలీసులు ఆంక్షలు ఉన్నా మాములుగానే కొనసాగుతున్నాయి.పట్టణంలో ఏబీఎన్ పీఆర్ఆర్ కళాశాల సమీపంలో ప్రధాన హైవే రహదారికి చేరువులోను, ఆరికిరేవుల, పశివేదల, సీతంపేట, ఐ.పంగిడి గ్రామాల్లో నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. తాళ్లపూడి మండలం పెద్దేవంలో ఏర్పాటు చేసిన పందెం బరిని ఇప్పటికే కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయబాబు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. అయినా నిర్వాహకులు ఏర్పాట్లను ఆపలేదు. గజ్జరం, తాళ్లపూడి, పోచవరం గ్రామాల్లో పందెల నిర్వహణ శిబిరాలు ఏర్పాటు చేశారు.

వివేకానందుడు ఆదర్శప్రాయుడు


ఉండ్రాజవరంలో వివేకనందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


కొవ్వూరులో వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు


కొవ్వూరు: స్వామి వివేకానంద జయంతిని ఆదివారం కొవ్వూరులో ఘనంగా నిర్వహించారు. టోల్‌గేట్ జంక్షన్ వద్ద ఏటిగట్టుపై ఉన్న వివేకానందుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వివేకానంద ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు. రవాణా శాఖాధికారి కేవీ శివప్రసాద్, వివేకానంద యువజన సమితి సంయుక్త కార్యదర్శి భరద్వాజ శర్మ, వివేకానంద ఫౌండేషన్ చైర్మన్ అనపర్తి గోపాలకృష్ణ, యువజన సమితి అధ్యక్షుడు ఎస్.రాఘవేంద్ర, ఆర్ఎస్ఎస్ పట్టణ సేవా ప్రముఖ్ గూడపాటి శ్రీహరి, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైకే శ్రీనివాస్, పట్టణ ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాంధీ, సుంకవల్లి హరనాథ్, సీహెచ్ సాయిరాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీ కృష్ణ, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వివేకానందుని జయంతి

ఉండ్రాజవరం: భారతదేశ సంస్కృతిని దేశవిదేశాల్లో చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకనందుడని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆకెళ్ల శ్రీనివాసు అన్నారు. స్వామి వివేకనందుని జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు గుత్తికొండ కృష్ణారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ స్వామి వివేకనందేపి ఆదర్శంగా తీసుకొని ఆయన బోధనలను ఆచరించాలని కోరారు. ముందుగా వివేకనంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు బంధకవి సాయి శేఖర్, కె.వి.రమణ, కె.వి.కృష్ణారావు, కె.వీర వెంకటసత్యనారాయణ, ఎస్.సింహద్రి, శ్రీరామచంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు పేరును శ్రీరామ పాద సాగరంగా మార్చాలి

కొవ్వూరు: పోలవరం ప్రాజెక్టు పేరును శ్రీరామ పాద సాగరంగా మార్పు చేయాలని కోరుతూ బీజేపీ నాయకుడు గండ్రోతు పవన్ సోమరాజు ఆదివారం ప్రాజెక్టు పరిశీలనకు విచ్చేసిన కేంద్రం బృందానికి వినతిపత్రం అందజేశారు. గోదావరి నదిపై 1941లో కేఎల్ రావు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వే చేసి అప్పట్లో ప్రాజెక్టు పేరు శ్రీరామ పాద సాగరంగా నామకరణం చేశారన్నారు. త్రేతా యుగంలో సీతా, రామ లక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు అరణ్యవాసం గోదావరి నది తీరం ప్రాంతమైన భద్రచలం పరిసరాల్లో సాగిందన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పూర్తయితే బ్యాక్ వాటర్ భద్రచలాన్ని తాకుతుందన్నారు. అందుచేత ఈ ప్రాజెక్టుకి శ్రీరామ పాద సాగరంగా నామకరణం చేయడం సహేతుకమన్నారు.


పార్లమెంటరీ కమిటీ చైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూడీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పోలవరం వెళ్లి పార్లమెంటరీ కమిటీ చైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూడీకి ఈ మేరకు వినతి పత్రం అందజేసి, ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరించినట్టు ఆయన తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

రాజమహేంద్రవరం రూరల్: కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని హుకుంపేట సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు తెల్లమేకల సూర్యకృష్ణ అన్నారు. ఆదివారం పిడింగొయ్యి గ్రామంలో కరాటే కోచ్ పంచికట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు రూ.7 వేల విలువ చేసే నాన్‌సాక్స్, కరాటే కిట్లను తెల్లమేకల సూర్యకృష్ణ, మణి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచికట్ల ఉమామహేశ్వరరావు పి.లక్ష్మీలావణ్య, జి.నాగదుర్గతేజ తదితరులు పాల్గొన్నారు.

తెలికిచెర్లలో క్రికెట్ పోటీలు

నల్లజర్ల: తెలకిచెర్ల గ్రామంలోని యూత్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సత్తిపండు టీమ్, భూషణం, ప్రవీణ్, తాండవ టీమ్‌లు పాల్గొనగా విన్నర్‌గా తాండవ టీమ్, రన్నర్‌గా సత్తిపండు టీమ్ నిలచింది. మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.2,500, పాల్గొన్న క్రీడాకారులకు ట్రోఫీలు సర్పంచ్ బండి చిట్టీ అందజేశారు. కార్యక్రమంలో రుద్రాశ్రీనివాస్, సుంకర సుబ్బారావు, సుంకర రామకృష్ణ, ప్రతాప్, సీమకుర్తి రాము, వంకిన రామ్మోహనరావు, వీరమళ్ల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్యాజంపూడిలో ఆటల పోటీలు ప్రారంభం

దేవరపల్లి: డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని త్యాజంపూడిలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఆటల పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలకు వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల కన్వీనర్, ఉపసర్పంచ్ కుసులూరి వెంకటసతీష్ ప్రారంభించారు. మండల స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ సందర్భంగా వెంకటసతీష్ మాట్లాడుతూ యువతీ, యువకులు చెడు వ్యసనాల బారిన పడకుండా క్రీడలు దోహదపడతాయన్నారు. జూదాలకు వ్యతిరేకంగా డీవైఎఫ్ఐ క్రీడలను నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. పండుగల సమయంలో ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఆటల పోటీలు నిర్వహించాలని ఆయన కోరారు. డీవైఎఫ్ఐ కార్యదర్శి కొత్తపల్లి తాతారావు మాట్లాడుతూ వాలీబాల్ పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. మూడు రోజులు పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లి రత్నారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు అక్కిన సుబ్బారావు, జనసేన నాయకుడు దావాల శ్రీనివాస్, సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్. భగత్, డీవైఎఫ్ఐ నాయకులు గట్టెం నాని, సిరుగునీడి రమేష్ బాబు, సకినాల ఉపేంద్ర, బండి నాని, సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


విజేత టీమ్‌కు నగదు బహుమతి అందజేస్తున్న సర్పంచ్ బండి చిట్టీ తదితరులు


త్యాజంపూడిలో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, ఉప సర్పంచ్ వెంకటసతీష్